క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎంపీటీసీ



మంత్రికి సమస్యలు విన్నవిస్తున్న ఎంపీటీసీ బండారి రమేశ్

తిమ్మాపూర్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మండలంలోని పోలంపల్లి ఎంపీటీసీ బండారి రమేశ్ మంత్రి నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. సమస్యలు పరిష్కరించాలని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రిని కోరినట్లు ఎంపీటీసీ తెలిపారు.

నిధులు మంజూరు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల సౌకర్యం కోసం అంబులెన్స్ ఏర్పాటుకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధులు మంజూరు చేశారు. గ్రామానికి చెందిన నిత్య జనగణమన నిర్వాహకులు ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, కొత్త సతీశ్‌తో పాటు సభ్యులు 2019, 2020లో బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. అంబులెన్స్ కొనుగోలు చేయడానికి నిధులు మంజూరు చేస్తూ ఎంపీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిత్య జనగణమన కమిటీ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

'దాడిని ఖండిస్తున్నాం'

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 3వ వార్డు రామన్నపల్లిలో ముగ్గురిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ అన్నారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర రవాణా,బీసీ, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బద్నాం చేయాడానికి కొంతమంది సోషల్ మీడియాలో తప్పుడు వీడియోలు ప్రచారం చేస్తున్నారని, మంత్రిపై అవాస్తవాలు, నిరాధారణ ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'తప్పుడు ప్రచారం సహించం'

హుజూరాబాద్: రాష్ట్ర బీసీ,రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సోషల్ మీడియాను వేదికగా చేసుకొని తప్పుడు ప్రచారం చేస్తే సహించమని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ స్పష్టం చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మికుంట పట్టణంలోని 3వ వార్డులో జరిగిన దాడిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దాడిలో గాయపడిన క్షతగాత్రుడిని ఫోన్‌లో పరామర్శించారు.

లక్పతీలుగా చేయాలి

సైదాపూర్: అర్హులైన మహిళలను గుర్తించి, ఆదాయ వనరులు కల్పించి, లక్పతీ దీదీలుగా తయారు చేయాలని కరీంనగర్ డీఆర్‌డీవో సునీత అన్నారు. మంగళవారం మండలంలోని స్త్రీ శక్తి భవనంలో సంతోషిమాత మండల మహిళా సమాఖ్య సెర్ప్ ఉద్యోగులకు, వీవోఏలకు లక్పతీ దీదీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్ పర్యవేక్షణలో గ్రామైఖ్య సంఘం నుంచి 80 మంది మహిళలను గుర్తించి, వారిని ఫెసిలిటేట్ చేస్తూ, ట్రబుల్ షూటర్‌గా నైపుణ్యాలు కల్పించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. గుర్తించిన మహిళలను రెండేండ్లలో లక్పతీ దీదీలుగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి, ఎంఎస్ అధ్యక్షురాలు రజిత, సీబీవో తిరుపతి,సీసీలు దేవేందర్, రమేష్, పర్శరాములు, శ్రీనివాస్, రంజిత్, జమున, రాజేశ్వరి, కిషోర్, గీత, వీవోఏలు పాల్గొన్నారు.

హుండీలు బహూకరణ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ఉప్పుగల్ల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని మూడు హుండీలను బహూకరించారు.

'దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి'



పరామర్శిస్తున్న కౌశిక్‌రెడ్డి, నాయకులు

జమ్మికుంట: బీఆర్‌ఎస్ నాయకులపై దాడికి పాల్పడిన మూడో వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు మేడిపల్లి రవీందర్‌పై క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతిని కోరామని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. చికిత్స పొందుతున్న బాధితుడు మల్లయ్యను మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేస్తూ అడిగినందుకు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మంత్రి అండదండలు ఉన్నాయని, కౌన్సిలర్ రవీందర్ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ అంధకారమే..

- ఎవరికి సెంట్రల్ లైటింగ్..?
- అల్గునూర్ చౌరస్తా నుంచి మహాత్మానగర్ వరకు గతేడాది ఏర్పాటు
- సంవత్సరానికే ఆరిపోయిన విద్యుత్ దీపాలు
- తిమ్మాపూర్ పోలీస్‌స్టేషన్ వరకు ఏర్పాటు సాధ్యమేనా!

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అల్గునూర్ చౌరస్తా నుంచి మహాత్మానగర్ వరకు రాజీవ్ రహదారి మధ్యలో గతేడాది అక్టోబర్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఒకప్పుడు చీకటిగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో కొన్నిరోజులు వెలుగులు విరజిమ్మాయి. ఆరు నెలలు బాగానే ఉంది. కానీ వాహనాలు స్తంభాలను ఢీకొనడం, నిర్వహణలోపం కారణగా ఎల్ఎండీ కాలనీ సమీపంలో కొన్ని లైట్లు వెలగడం లేదు. దీంతో ఆప్రాంతమంతా మళ్లీ అంధకారం అలుముకుంటోంది.

సుమారు 170 లైట్లు...

అలుగునూర్ నుంచి మహాత్మానగర్ తాపాళ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు రాజీవ్ రాహదారి మధ్యలో సుమారు 170 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 10 స్తంభాలు వాహనాలు ఢీకొని విరిగిపోయాయి. రాత్రిపూట ప్రమాదం జరిగి విరిగిపోయిన స్తంభాలే అధికం. ప్రస్తుతం వాటిని తిరిగి ఏర్పాటు చేసే మార్గం లేకుండా పోయిందని పలువురు అంటున్నారు.

పోలీస్ స్టేషన్ వరకు ఏర్పాటు సాధ్యమేనా?

సెంట్రల్ లైటింగ్‌ను అల్గునూరు నుంచి వాగేశ్వరీ సమీపం వరకు ఏర్పాటు చేస్తానని గత ప్రభుత్వం, అప్పటి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో మిగతా సెంట్రింగ్ లైట్ ఏర్పాటు కలగానే మారనుందా అని వాహనదారులు అంటున్నారు. ఉన్నవాటి నిర్వహణను అటు మున్సిపల్ అధికారులు, ఇటు విద్యుత్‌శాఖ అధికారులుగానీ పట్టించుకోవడం లేదు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ వరకూ పొడిగిస్తే అక్కడ ఉన్న రవాణాశాఖ కార్యాలయం, రెండు ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు తొలగిపోనున్నాయి. రెండు కళాశాలలకు నిత్యం ఐదువేల మందికిపైగా విద్యార్థులు వస్తుంటారు. రాత్రివేళలో చీకటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ తీసుకుని సెంట్రల్ లైటింగ్ నిర్వహణపై చర్యలు తీసుకోవడంతోపాటు పోలీస్ స్టేషన్ వరకు పొడిగించేలా చూడాలని వాహనదారులు, స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.



చర్యలు తీసుకుంటాం

హైవే మధ్యలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ సెంట్రల్ లైటింగ్ నిర్వహణ ప్రస్తుతం మున్సిపల్ అధికారులు చేపడుతున్నారు. కొన్ని ప్రమాదాల కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వాటిని తిరిగి ఏర్పాటు చేసే విధంగా అధికారులు, మేయర్ దృష్టికి తీసుకెళ్తాం. ప్రతిరోజు రాత్రిపూట లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– సల్ల శారద, కార్పొరేటర్, అల్గునూర్

ఘనంగా మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం



మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో మత్స్యగిరీంద్రస్వామివారి కల్యాణం మంగళవారం వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్వామివారికి పట్టువస్త్రాలు, ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలను అందజేశారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన విడెపు వంశస్తులు సాంప్రదాయ ప్రకారం వరుడు వైపు మంగళ సూత్రాలను తీసుకురాగా కొత్తగట్టు గుట్టపై ఎదుర్కోలు నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణానికి వచ్చిన భక్తులు నేలపై కూర్చొని ఇబ్బందులకు గురయ్యారు. కార్పెట్లు వేయక పోవడంతో నేలపై కూర్చున్నారు. మంచినీటి సౌకర్యం, చలువ పందిళ్లు వేయకపోవడంతో ఆలయ ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఓ సుధాకర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



మాదాపూర్‌లో డ్రాగన్‌తోటను సందర్శిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గన్నేరువరం: ఫ్లవర్ బొకే శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జంగపల్లి గ్రామంలో నాబార్డు సౌజన్యంతో జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని ఫ్లవర్ బొకే శిక్షణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మండలంలోని మాదాపూర్ గ్రామంలో రైతు క్లెం అంజిరెడ్డి సాగు చేస్తున్న బత్తాయి, క్లెం ముత్యంరెడ్డి, క్లెం గంగవ్వల డ్రాగన్ తోటను, జంగపల్లిలో దంపతులు కర్ర శ్రీకాంత్‌రెడ్డిఅనూష సాగు చేస్తున్న బంతి, చామంతి, లిల్లీ, కర్ర నరసవ్వ సాగు చేస్తున్న కొబ్బరితోట సందర్శించారు. మిగతా రైతులు వీరిని ఆదర్శతీసుకుని సాంప్రదాయ పంటలు కాకుండా వాణిజ్య పంటలవైపు దృష్టి సారించాలన్నారు. అధికారులు రైతులను ప్రోత్సాహించాలని సూచించారు. బత్తాయి తోట నిర్వహణకు సంబంధించి డబ్బులు రాలేదని రైతు అటికం రవి, సీసీ రోడ్డు పనులకు సంబంధించిన రూ. 10 లక్షల బిల్లులు రెండేళ్లగా మంజూరు కాలేదని ఎంపీటీసీ అటికం రాజేశం కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఖాసీంపేట గ్రామంలోని శ్రీమానసాదేవి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, అడిషనల్ పీడీ సంధ్యారాణి, ఉద్యానశాఖ అధికారి స్వాతి, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో శంకర్, ఈసీ రమేష్, ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్: వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం క్రీడా వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సత్ప్రవర్తనతో ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కళాశాల ప్రహరీ, నాలుగు క్లాస్ రూంల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని అన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అంజనేయరావు, ఎంపీడీఓ నర్సయ్య, లెక్చలర్స్ శరత్ చంద్రప్రకాశ్, రమేశ్, శ్రీధర్, శ్రీనివాస్, మంజుల, లలిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, గసిగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ మల్లారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ కోటి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు అనంతరెడ్డి, సునీల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, మాజీ ఎంపీటీసీ జ్యోతి, మాజీ ఉప సర్పంచ్ సంపత్‌రెడ్డి, మల్లేశం, తిరుపతి, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జై భీం యూత్ క్లబ్ సభ్యులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యూత్ క్లబ్ సభ్యులు పృథ్వీరాజ్, సాయి, సందీప్,రామ్

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామం జై భీం యూత్ క్లబ్ సభ్యులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మంగళవారం కలిశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల పృథ్వీరాజ్, దొమ్మాటి సాయి, గజ్జెల సందీప్, ఆరెపెల్లి రామ్, సిద్ధార్థ, నితిన్ పలువురు పాల్గొన్నారు.

ఫ్రిడ్జ్ బహూకరణ...

హుజూరాబాద్: పట్టణంలోని గ్రంథాలయానికి కరీంనగర్ స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శ్రీప్రఫుల్ దేశాయ్ కూల్‌వాటర్ ఫ్రిడ్జ్‌ను బహూకరించారు. మంగళవారం గ్రంథాలయ పాలకురాలు ఎం.కనకలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో ఇలాసాగరం వీరస్వామి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేల్పుల రత్నం, గ్రంథాలయ పాఠకులు ఉన్నారు.

పీఎం కిసాన్ సమృద్ధి యోజన ఖాతాలు తీసుకోవాలి

శంకరపట్నం: పీఎం కిసాన్ సమృద్ధి యోజనకు సంబంధించి డబ్బులు పొందటానికి పోస్టాఫీసుల్లో రైతులు ఖాతాలు తీసుకోవాలని మండల ఏఓ శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో రైతులు తీసుకున్న ఖాతాలను మంగళవారం పరిశీలించారు. బ్యాంకు ఖాతాలు ఉన్న రైతులకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న సాయం అందడంలేదని రైతులు ఫిర్యాదు చేయగా పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరిపిస్తున్నామని చెప్పారు. అనంతరం రైతువేదికలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను దైవంగా భావించాలి

మానకొండూర్‌రూరల్: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం ప్రిన్సిపల్ అర్చన ప్రియదర్శిని ఆధ్వర్యంలో తల్లిదండ్రుల పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సంత్‌శ్రీ ఆశారామ్ బాపూజీ ఆశ్రమం నుంచి విచ్చేసిన సాధకులు శరత్, వ్యాస్, వాణి, రవి మంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ దేవుడికి పూజలు ఎలా చేస్తామో తల్లిదండ్రులను దైవ సమానంగా భావించి పూజించాలని తెలిపారు. భారతీయ శాస్త్రాలలో పూర్వీకులు తల్లిడంద్రులకు ఇచ్చిన గౌరవం కథల రూపంలో పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ జయంతి

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో మంగళవారం సేవాబస్తీ కార్యక్రమంలో భాగంగా సంత్ రవిదాస్ జయంతిని ధర్మ జాగరణ సమన్వయ విభాగం రామడుగు మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాములుగౌడ్, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అంజన్న, రవీందర్, లక్ష్మీనారాయణ, అనసూర్య, పలువురు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచు సముద్రాల అజయ్ మంగళవారం స్నాక్స్ అందజేశారు. వార్షిక పరీక్షల సందర్భంగా ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు, ఆకలి కాకుండా ఉండేందుకు స్నాక్స్ అందజేస్తున్నామని, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని అజయ్ సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను పూర్తి సమయం నడపాలి

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్తి సమయం నడిచేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్, నాయకులు మంగళవారం ఇంటర్ విద్యాధికారి జగన్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో డిగ్రీ కళాశాల నూతన భవనం నిర్మిస్తున్న క్రమంలో డిగ్రీ కళాశాల క్లాసులను జూనియర్ కళాశాలలో నడుపుతూ గతేడాది నుంచి సమయాన్ని కుదించారని, జూనియర్ కళాశాల 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, డిగ్రీ కళాశాల మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ఇంటర్ విద్యా అధికారులు స్పందించి జూనియర్ కళాశాల పూర్తి సమయం నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్, నాయకులు కసిరెడ్డి, సందీప్‌రెడ్డి, రాహుల్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు అధైర్యపడొద్దు

హుజూరాబాద్: అర్హులైన దళితులకు రెండో విడుత దళితబంధు నిధులు తప్పకుండా వస్తాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో మాట్లాడారు. రాజకీయ ఉనికి కోసమే బీఆర్‌ఎస్‌నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రెండేళ్ల ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో దళితబంధు పథకానికి సంబంధించిన పూర్తి నిధులు ఎందుకు మంజూరు చేయలేదో జవాబు ఇవ్వాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్, దళిత బంధు లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామానికి చెందిన ఇల్లందుల రమేశ్‌ను బీఎస్పీ హుజూరాబాద్ మండల ఇన్‌చార్జిగా నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి వాసాల రమేశ్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో బహుజన పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ప్రజా సమస్యలపై పార్టీ తరుపున ముందుండి పోరాడుతానని, నియామకానికి సహకరించిన నాయకులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు ఎం. ఆశ్రయ, బి.సాక్షి సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇంటర్మీడియేట్ కామర్స్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రెండో దశ పరీక్షలకు ఎంపికయ్యారు. ఈమేరకు మంగళవారం విద్యార్థులను హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీడీవోకు సన్మానం



సన్మానిస్తున్న రాజు, రాజేశేఖర్, రమేశ్, విజయ్

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన తూర్పాటి సునీతను మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు రాజశేఖర్, రమేష్, విజయ్, సాయిరాం, అరవింద్ తదితరులు ఉన్నారు.

చెల్పూరు విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న వినయ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన విద్యార్థి గన్ను వినయ్ వరంగల్ జిల్లా చైతన్య డిమ్డ్ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ మైక్రో బయోలాజీ పరీక్ష ఫలితాల్లో బంగారు పతకం సాధించారు. ఈసందర్భంగా సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కల్యాణ్‌చక్రవర్తి, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ పురుషోత్తమ్‌రెడ్డి విద్యార్థికి బంగారు పతకం అందించారు. పతకం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తప్పిపోయిన వృద్ధుడిని ఇంటికి చేర్చిన మాజీ సర్పంచ్



బస్ చార్జీలు అందిస్తున్న మాజీ సర్పంచ్ రమేశ్

మానకొండూర్: తప్పిపోయిన ఓ వృద్ధుడిని మండలంలోని నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాడు. వివరాలు... మంగళవారం నుస్తులాపూర్‌లోని రాజీవ్ రహదారిపై వృద్ధుడు స్థానికులకు కనిపించాడు. వెంటనే మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ వద్దకు తీసుకెళ్లారు. పేరు, ఊరు, కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని వృద్ధుడిది భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలం సీతారాంపూర్ గ్రామంగా గుర్తించారు. ఆ గ్రామ ఎంపీటీసీ అశోక్ రెడ్డి భూపాలపల్లి సీఐకి ఫోన్ చేసి సమాచారం అందించారు. వృద్ధుడి పేరు కండె మొగిలి అని తెలిసింది. సోమవారం సాయంత్రం కొండగట్టుకు దర్శనం కోసం వెళ్లి అక్కడ తప్పిపోయాడని తెలిసింది. ఏం చేయాలో తెలియక సీతారాంపూర్ గ్రామానికి నడుచుకుంటూ బయలుదేరాడు. వరంగల్ రహదారి కి బదులు హైదరాబాద్ రహదారి మీదుగా వెళ్తూ నుస్తులాపూర్ చేరుకున్నాడు. ఆకలితో ఉన్న వృద్ధుడికి రమేశ్ భోజనం పెట్టి బస్సు చార్జీల కోసం రూ.వెయ్యి అందించారు. అనంతరం తిమ్మాపూర్ ఎస్సై చేరాలకు సమాచారమివ్వడంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ నరేశ్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. వృద్ధుడిని క్షేమంగా అప్పగించినందుకు మాజీ సర్పంచ్ రావుల రమేశ్, సాక్షి విలేకరి బత్తుల రాకేశ్‌ని కుటుంబ సభ్యులతో పాటు ఎస్సై చేరాలు అభినందించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రామడుగు: వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా రైతులు సస్యరక్షణ చర్యలను చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని రామడుగు, గోపాల్‌రావుపేట రైతు వేదికల్లో పంటలకు సోకుతున్న తెగుళ్ల చేపట్టాల్సిన రక్షణ చర్యలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు వ్యవసాయాధికారులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

సూచించిన మందులు వాడాలి

హుజూరాబాద్‌రూరల్: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పంట సంరక్షణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సిర్సపల్లి గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. రైతు సంఘాల ప్రాముఖ్యత, దానివల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల మూలంగా కాండం తొలుచుపురుగు, అగ్గి తెగులు, కాండం కుళ్లు రోగాలు గుర్తించినట్లు తెలిపారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ విస్తరణాధికారులు సూచించిన పురుగుమందులను వాడాలని సూచించారు. అలాగే కనుకులగిద్దె గ్రామంలోని రైతు వేదికలో క్రిమిసంహారక మందుల నిర్వహణ రైతులకు వివరించారు. సమావేశంలో ఏడీఏ సునీత, డీడీఏ చత్రునాయక్, మండల వ్యవసాయాధికారి సునీల్‌రెడ్డి, సీఎస్ఏ సభ్యులు యాదవరెడ్డి, మేనేజర్ వెంకట్ కుమార్, ఏఈవో ఉజ్మానిషాత్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

వీణవంక: మండలంలోని ఎల్బాక గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జాతర సమయంలో జంతు, పక్షి, వ్యర్థాలు శుభ్రం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, వసతులు, సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం అంజారెడ్డి, టీచర్లు పావని, వేణు, సతీష్‌కుమార్, సత్యం, రామస్వామి, సాబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి బృహత్తర పథకాలు

హుజూరాబాద్‌రూరల్: మహిళల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బృహత్తర పథకాలను తీసుకొచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని చెల్పూర్ గ్రామంలో మంగళవారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో శక్తి వందన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంక్షేమం కోసం ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు రాముల కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పారిపెల్లి కొండాల్‌రెడ్డి,మండల ఉపాధ్యక్షులు మహేష్,రవీందర్,కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి,పంజాల లక్ష్మి, కొంకటి రమేష్ ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడటంతో గాయాలయ్యాయి. గ్రామస్తుల తెలిపిన వివరాలు.. తాళ్లపల్లి అశోక్‌గౌడ్ వృత్తిలో భాగంగా రోజూలాగే మంగళవారం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం లోటస్ పాండ్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్‌రావు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. తల్లిదండ్రులు కొంత సమయం పిల్లలతో గడపాలని, అప్పుడే వారి భవిష్యత్‌కు బాటలు పడుతాయన్నారు. అనంతరం ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. క్రీడా పోటీలు, డ్యాన్స్‌లో ప్రతిభ కనబరిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాస్‌రావు, దయాకర్‌రావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.